● అట్టుంటనా!

పున్నెముంటాది.. ఒక్కసారి వొచ్చెల్లిపో సామీ!



'ఇదిగో.. అదిగో అంటానే ఉండారు. కానీ ఎప్పుడొస్తాడో సరిగ్గా తెలవకపాయె. కాలవలో నీల్లు నిలవకపాయె. నీకు పున్నెముంటాది ఒక్కసారి వొచ్చెల్లిపో సామీ' అని ఆపీసర్లు ఒకటే ఇదైపోతున్నారంట. మీకీపాటికి అర్తమయ్యే ఉంటాది. ఈ కత సీఎం జగన్‌రెడ్డి కుప్పం పర్యటన గురించేనని. ఒకసారా రెండు సార్లా ఇప్పటికి మూడుసార్లు సీఎం సారు టూర్ ప్రోగ్రాం ఉంటాదని చెప్పి, మల్లీ క్యాన్సిలైపాయె. మొదుట్లో రామకుప్పంలో ఈనెల అయిదో తేదీన వొచ్చి మీటింగు పెడ్తాడని చెప్పినారా. కలెక్టరు, ఎస్పీసారు గూడా అక్కడికి వొచ్చేసి మీటింగు పెట్టే స్తలాన్ని ఎతికేసి ఎల్లినారు. ఇంగ హంద్రీ-నీవా ఆపీసర్ల అడావుడి చెప్పనే అక్కరలేదు. పుంగనూరుకు, కుప్పానికి తెగ చక్కర్లు కొట్టేసినారు. అక్కడి నుంచి ఎన్ని లిఫ్టులతో ఎత్తిపోసినా, ఇక్కడ కాలవలోకి చిన్నపిల్లాడు ఉచ్చపోసినట్లు గూడా నీల్లు కదిలి రాకపాయె. ముక్కెంగా ముక్కెమంతిరి వొస్తావుండేది ఈ కాలవను ప్రారంభించేదానికేనంట. ఆ నీల్లు గూడా రెండ్రోజులకు ఎండిపాయె. ఇదేందో తమ తలమిందికి వస్తాదని పెద్ద ఆపీసర్లు పైకి విన్నవించుకున్నారు. దీంతో ప్రోగ్రాం తుస్సుమనిపాయె. హమ్మయ్య అని ఆపీసర్లు ఊపిరి పీల్చుకునేకొందికి, సారు 12 తేదీ వొచ్చేస్తావుండారని అడావుడి చేసేస్తిరి నాయకులు. కాలవలో నీల్లెక్కడుండాయి, లేవుగదా. మల్లీ వాయిదా పడిపోయింది. ఈసారి 16వ తేదీ సారు వొచ్చేది పక్కా అని విజయవాడ ఎల్లిన ఒకరిద్దరు కుప్పం నాయకులు ఆడినింకా ఫోను కొట్టిరి. ఇంకేముండాది.. కలెక్టర్ సారు.. ఆగమేగాలమింద శాంతిపురం మండలం మఠం దగ్గరికి వొచ్చేసి మీటింగుకోసం స్తలం జూసేసి మంచీ సెబ్బరా మాట్లాడి ఎల్లిపోయినాడు. ఈరోజుతో ఆ తేదీ కూడా దాటిపోయింది అనుకోండి. మల్లీ గురువారంనాడు కలెక్టరు సారుతో సహా చాలామంది అతికారులు మఠం దెగ్గిర దిగిపోయిరి. దీంతో సీఎం ప్రోగ్రాం ఉండేటట్టే ఉండాదిరో అని ప్రెస్సోళ్లతోపాటు చుట్టుపక్కలున్న జనం చెప్పుకుంటిరి. ఈనెల 26వ తేదీ ఫిక్స్ అయిందని గట్టిగా చెప్తావుండారు. రామకుప్పం మండలం గుండిశెట్టిపల్లెకు మొదుట ఎల్లి, అక్కడ హంద్రీ-నీవా కాలువను ప్రారంభించేసి అనాక మఠం దగ్గరికొచ్చేసి మీటింగు పెడ్తారని అంటా ఉండారు. కనాకష్టం ఆరేడెకరాలను చెట్లుపుట్టలు కొట్టి చదును చేయడానికి మల్లుకున్నారు శుక్రారంనాడు. అంతా బాగానే ఉండాది కానీ ఇప్పుడు హెచ్ఎన్ఎస్ఎస్ అతికారుల మొగాలే సూడలేకండా ఉండాము సామీ. లేని నీల్లను హంద్రీ-నీవా కాలవలోకి ఎట్టా తేవాలిరా సామీ అని తలలు పట్టుకుంటా ఉండారు




పాపీ ఆ సార్లు. కృష్ణానదిలో నీల్లు ఎండిపాయె. పుంగనూరు లిఫ్టులతో తెచ్చే నీల్లు ఈడదాకా సరిగా పారకపాయె. 'అదేమో మాకు తెలీదప్పా, సీఎం వొచ్చే యాళకు కాలవలో పుల్లుగా నీల్లు పరుగులు పెడ్తా ఉండాల' అని ఆయన పేషీనుంచి ఒగటే ఫోన్లంట. ఏం జేస్తారో పాపం ఆ సార్లు..చూడాల!

- కుప్పం

సమయంలేదు.. గ్రామాలకు తరలండి

● వైసీపీ అరాచకాలను ఎండగట్టండి ● సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి
● కుప్పం టీడీపీ శ్రేణులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



కుప్పం, ఫిబ్రవరి 16: 'ఇక ఎంతో సమయం లేదు. అందరూ గ్రామాలకు తరలి వెళ్లండి. జనం మనసుకు ఎక్కేలా వైసీపీ అరాచకాలను ఎండగట్టడంతోపాటు మనం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించండి' అని టీడీపీ శ్రేణులకు చంద్రబాబు పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో శుక్రవారం మధ్యాహ్నం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు సాగిన ఈ కాన్ఫరెన్సులో త్వరలోనే జరగనున్న ఎన్నికలను ఉద్దేశించి, పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన ప్రచార వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. 'మనం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేశాం. అదే సమయంలో దానికి సమాంతరంగా అభివృద్ధి చేసి చూపించాం. అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యమిచ్చాం. నేడు కుప్పంలో గ్రామాలకు రోడ్లు ఉన్నాయన్నా, పాఠశాలలకు.. ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు ఉన్నాయన్నా టీడీపీ చేసిన అభివృద్ధిలో భాగమే. అప్పట్లో సోషల్ మీడియా ఇంత ఎక్కువగా లేనందున ప్రచారం చేసుకోలేక పోయాం. వైసీపీ అధికారంలోకి వచ్చాక మన పథకాలను కాపీ కొట్టి, సోషల్ మీడియాలో తమ సొంత పథకాలన్నట్లు ప్రచారాన్ని ఊదరగొట్టేస్తోంది. వారి పథకాలు చాలా మంది అర్హులకు అందడంలేదు. ఆ విషయం మాత్రం మరుగునపడిపోతోంది. ఎన్నికలు గట్టిగా రెండు నెలలు కూడా లేదు. మీరు సభలు, సమావేశాలు అంటూ ఒక్కదగ్గరే కూచుంటే ఇక లాభం లేదు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టి గ్రామాలలో విస్తృతంగా పర్యటించండి. మనం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల ప్రచారాన్ని పీక్‌కు తీసుకెళ్లండి. వైసీపీ పాలనలో గ్రామాలలో కుంటుపడిన అభివృద్ధిపైన చర్చ పెట్టండి. వైసీపీ బాధితుల కుటుంబాలను కలిసి భరోసా ఇవ్వండి. రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, బీసీ, ముస్లిం మైనారిటీ సహా సకల వర్గాలకూ వైసీపీ పాలనలో జరిగిన అన్యాయంపై ప్రచారం చేయండి. ఇప్పుడు ఇప్పుడు మౌనంగా ఉండిపోయిన పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలను కలుపుకొని సమావేశాలు నిర్వహించండి. వారి ద్వారా ప్రచారాన్ని సాగించండి. వారికైతే ఆయా గ్రామాల వాస్తవ విషయాలు తెలుస్తాయి. మారిన పరిస్థితుల్లో అధికార పార్టీకి చెందిన గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు కూడా మనకు అనుకూలంగా ఉన్నారు. వీలైతే వారిని కూడా కలుపుకొని వెళ్లడానికి ప్రయత్నించండి. సకల కోణాలలో ఎన్నికలకు సిద్ధం కావాల్సిన తరుణం ఇది. రాష్ట్రంలో వాతావరణం మనకు పూర్తిగా అనుకూలంగా ఉంది. ప్రజలు మానసికంగా మనకు దగ్గరయ్యారు. ఈ అనుకూలతను ఓట్లుగా మార్చుకోవడం ఇక మీవంతు. ఊరికే ఇళ్లదగ్గర కూచుంటే ఫలితం లేదు. గ్రామాలలోనే మనం తేల్చుకోవాలి. ఎన్నికలను సమర్థంగా ఎదుర్కోవాలంటే జనాలను కలిసి వారితో మమేకం అవడం ఒక్కటే సరైన మార్గం. ఆపని మీరు చేస్తేనే మనం లక్ష్యంగా విధించుకున్న లక్ష మెజారిటీ సాధ్యమవుతుంది' అంటూ పార్టీ నేతలు, శ్రేణులకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

కాణిపాకంలో రథ సప్తమి వేడుకలు



ఉదయం కాణిపాకంలో వరసిద్ధుడి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చక, అధికారులు



మణికంఠేశ్వరస్వామి ఆలయంలో సూర్య భగవానుడు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 16: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. దీనికి కాకర్లవారిపల్లెకు చెందిన నాదముని నాయుడు కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేకువ జామున తొలుత ప్రధాన ఆలయం నుంచి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామిని ఊరేగించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవమూర్తులను సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. రథ సప్తమి వేడుకలను తిలకించడానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలు అమోఘం

● అబ్బురపరిచేలా నమూనాలు
● ముగిసిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్





చిత్తూరు, ఫిబ్రవరి 16: ఆయా రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలతో విద్యార్థులు అబ్బురమనిపించారు. యాదమరిలోని పీఈఎస్ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన.. శుక్రవారంతో ముగిసింది. ఈ ప్రదర్శనలో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు తమ మేథోసంపత్తిని ప్రతిబింబించేలా ప్రాజెక్టులు రూపొందించారు. తక్కువ ఖర్చుతో అన్ని వర్గాలవారికి ఉపయోగపడేలా విద్యార్థులు తయారుచేసిన నమూనాల్లో కొన్ని..

ఫెడల్ తొక్కుతూ మాపింగ్ చేసేలా..

పెద్దపెద్ద భవంతులు, కల్యాణ మండపాలు, సినిమా హాళ్లకు సులభంగా మాప్ వేసే (శుభ్రంచేసే) యంత్రాన్ని పూతలపట్టు మండలం పేటమిట్టలోని మంగల్ విద్యాలయ విద్యార్థి లోక్ ప్రకాష్ ఆవిష్కరించారు. మూడుచక్రాల బండిలా ఉండే ఈ యంత్రానికి అమర్చిన ఫెడల్ తొక్కుకుంటూ వెళ్లవచ్చు. ముందు, వెనుకభాగంలో డ్రై క్లీనర్, వెట్‌క్లీన్ చేసే క్లీనర్లను ఏర్పాటు చేశారు. దాంతో ముందున్న క్లీనర్ చెత్తను తోసుకుంటూ కింద అమర్చిన బాక్సులోకి చేర్చుతుంది. దాని వెనుకవైపు పైభాగంలో లైజాల్‌తో కలిపిన నీటి క్యాన్‌ను అమర్చుతారు. వాటి నుంచి నీరు క్లీనర్ (స్పాంజ్)పై పడుతుంటే వెనుకనే మాప్ చేస్తుంది.

ఆర్టిఫిషియల్ హ్యాండ్స్ ఫర్ టోర్సో పీపుల్



వ్యర్థమని పడేసిన ఇనుప కమ్మీ, వైర్లు, టేపు, వాటర్ బాటిల్, ఐస్‌క్రీమ్ పుల్లలు, బెంచీ, చక్రాలతో 'ఆర్టిఫిషియల్ హ్యాండ్స్ ఫర్ టోర్సో పీపుల్' యంత్రాన్ని తయారు చేశారు గుడుపల్లెలోని మోడల్ స్కూల్ విద్యార్థి శివశంకర్. ఈ యంత్రం తోడుంటే చెయ్యి, కాలులేని దివ్యాంగులు తమ కనీస అవసరాలను వారే సొంతంగా చేసుకోవచ్చు. కింద అమర్చిన బటన్‌ను నొక్కితే భుజం వద్ద ప్రత్యేకంగా అమర్చిన షోల్డర్ బాక్స్, లెడ్ బాక్స్ మూవింగ్ వల్ల స్పూన్ నోటి వద్దకు వస్తుంది. దీంతో చేతులు లేని వారు భోజనం చేయవచ్చు. అగ్ని ప్రమాదాలు వంటివి జరిగినప్పుడు వీరు పరిగెత్తలేనందున ప్రత్యేకంగా అమర్చిన బటన్‌ను నొక్కితే కార్బన్‌డయాక్సైడ్‌ను ఆ పరికరం పీల్చేసుకుంటుంది. వీటిని కేవలం రూ.480తో తయారు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 36 నమూనాల ఎంపిక

ఇన్‌స్పైర్ మనక్‌లో జిల్లావ్యాప్తంగా విద్యార్థులు ప్రదర్శించిన 365 నమూనాలను పరిశీలించిన న్యాయనిర్ణేతలు రాష్ట్రస్థాయి పోటీలకు 36 ఎంపిక చేశారు. ఇక, గుజరాత్ గాంధీనగర్‌కు చెందిన ఎన్ఐఎఫ్ అబ్జర్వర్ కృష్ణబిస్వాస్, రష్మీ గహేనే క్షుణ్ణంగా పరిశీలించి జాతీయ స్థాయికి మూడు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. గతేడాది జపాన్‌లోని సకూరలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన విద్యార్థి ఆకాష్ అనుభవాలను చెప్పించారు. గణిత ఉపాధ్యాయుడు అరుణశివప్రసాద్ ఆధ్వర్యంలో నలుగురు విద్యార్థులు గణిత అష్టావధానం నిర్వహించారు. మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. డీఈవో దేవరాజులు, జిల్లా సైన్స్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల కోసం అలెర్ట్ సిస్టం



సముద్రంలో చేపలుపట్టే క్రమంలో మత్స్యకారులు ఒక్కోసారి పడవలో పక్కదేశ సరిహద్దుల్లోకి వెళ్తుంటారు. ఆ దేశసైన్యం గుర్తించి వీరిని అదుపులోకి తీసుకోవడం.. ఒక్కోసారి కాల్పులు జరపడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి వారికోసం అలెర్ట్ ఆండ్రాయిడ్‌తో బార్డర్ అలెర్ట్ సిస్టంను తయారు చేశారు వి.కోటలోని వాణి విద్యాలయ విద్యార్థిని భవిష్య. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెన్సార్‌ను పడవకు అనుసంధానం చేస్తారు. మన దేశానికి చెందిన పడవలు ఇతర దేశ సరిహద్దులు దాటినప్పుడు సిగ్నల్స్ వస్తాయి. ఆ సిగ్నల్స్ ఆధారంగా పడవను మన సముద్ర భూభాగంలోనే నడుపుకోవచ్చు. దీని తయారీకి రూ.2వేలు ఖర్చయింది.

రైతుల కోసం 'ట్రావెలింగ్ ట్రాయ్'



అటవీ సమీప ప్రాంతాల్లో వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారింది. అలాంటి రైతుల కోసం 'ట్రావెలింగ్ టాయ్ లయన్ ప్రొటెక్ట్స్ ది ఫీల్డ్స్' సిస్టంను ఆవిష్కరించారు పలమనేరులోని ఓఎల్‌సీ స్కూల్ విద్యార్థి నయాజ్. పొలం చుట్టూ ఉండే గట్టును రైల్వే ట్రాక్‌లాగా తయారు చేశారు. ఎద్దుల బండిలాగ ఉండే పరికరానికి గేర్‌మోటారును అమర్చారు. సోలార్ ద్వారా గట్టుపై ప్రత్యేకంగా సింహం గర్జించే శబ్దంతో కూడిన బ్యాటరీని అమర్చారు. సోలార్ కరెంటుతో ట్రాక్‌పై ఆ బండి కదులుతూ ఉంటుంది. ఈ శబ్దం వల్ల పందులు, కోతులు, ఏనుగులు, ఇతర వన్యమృగాలు భయపడి వెళ్లిపోవడం వల్ల పంటలను కాపాడుకోవచ్చు.

చెత్త నిండితే అలర్ట్ చేసేలా..



పంచాయతీ, మున్సిపాలిటీకి చెందిన డస్ట్‌బిన్లు నిండినా చెత్త తీసుకెళ్లేవారు త్వరగా రారు. దీనివల్ల వచ్చే దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతుంటారు. దీనికి పరిష్కారంగా.. అలెర్ట్ సిస్టంను ఆవిష్కరించారు గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థి యువశ్రీ. ఆండ్రాయిడ్ బేస్డ్ స్వచ్ఛభారత్ యాప్‌ను కార్మికులు ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుంటారు. డస్ట్‌బిన్‌లో 80శాతం నిండిన వెంటనే సంబంధిత కార్మికులకు ఈ అలెర్ట్ సిస్టం ద్వారా సందేశం వెళుతుంది. దాంతో కార్మికులు సకాలంలో చెత్తను తీసుకెళతారు.

వర్షంలో ధాన్యం తడవకుండా..



మిద్దెపైన ధాన్యం ఎండబెట్టి ఉంటాం. ఉన్నట్లుండి వర్షం పడితే పట్టలు కప్పేందుకు ఎంత కష్టమో. ఈ కష్టం నుంచి రైతులకు అండగా నిలిచేలా రెయిన్‌ప్రొటెక్ట్ సిస్టంను రూపొందించారు సోమల మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని యువశ్రీ. ఇంటి మిద్దెపైన ఏసీ, డీసీ మీటరును ఏర్పాటు చేసి వాటిపై టార్పాలిన్ కవర్‌ను చుట్ట చుట్టి పెడతారు. వర్షపుతుంపర్లు ధాన్యంపై పడినప్పుడు సెన్సార్ ద్వారా ఏర్పాటు చేసిన మీటరు కరెంటు సాయంతో స్టార్ట్ అవుతుంది. దాంతో చుట్టగా చుట్టిన టార్పాలిన్ పట్ట ధాన్యం తడవకుండా కప్పేస్తుంది.

పలమనేరులో పట్టుబడిన చిత్తూరు గంజాయి స్మగ్లర్లు

● రెండు ఆటోల సీజ్ ● ఆరుగురి అరెస్టు

పలమనేరు, ఫిబ్రవరి 16: పలమనేరు సమీపం గాంధీనగర్ బస్టాప్ వద్ద చిత్తూరు, పూతలపట్టు మండలానికి చెందిన ఆరుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్టుచేసి, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గాంధీనగర్ బస్టాప్ వద్ద కొందరు యువకులు అనుమానాస్పద రీతిలో ఉన్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో వెళ్లామన్నారు. అక్కడ గంజాయిని చిన్నచిన్న పొట్లాలుగా కడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. వీరు చిత్తూరు సంతపేట ఇందిరానగర్‌కు చెందిన శంకర్(31), మురకంబట్టు జీకే కాలనీకి చెందిన పి.శశికుమార్(52), వినాయకపురానికి చెందిన జీసీ.యాగవ అలియాస్ చిట్టిబాబు(47), పూతలపట్టు మండలం బండపల్లికి చెందిన పెరుమాల్ (61), ఎస్.దిలీప్(30), ఎర్రచెరువుపల్లికి చెందిన డి.శరవణ(47)గా విచారణలో తేలిందన్నారు. వీరి నుంచి సుమారు మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, రెండు ఆటోలను కూడా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.మూడు రోజుల క్రితం వైజాగ్‌నుంచి వచ్చిన ఒక వ్యక్తినుంచి వీరు మూడు కిలోల గంజాయి కొన్నారన్నారు. ఆ గంజాయిని బెంగళూరులో విక్రయించేందుకు రెండు ఆటోల్లో బయలు దేరారన్నారు. మార్గమధ్యంలో డబ్బుల కోసం తమ వెంట తెచ్చిన గంజాయిని విక్రయించేందుకుగాను గాంధీనగర్ బస్టాప్ వద్ద నిలిపి చిన్నచిన్న ప్యాకెట్లుగా కడుతుండగా పట్టుబడ్డారని చెప్పారు. ఈ ఆరుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు.ఈ కేసులో ప్రతిభ కనబరచిన ఐడీ పార్టీ ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్ల శ్రీనప్పగౌడు, నరేష్‌కుమార్, విజయ్‌కుమార్, అశోక్‌ను సీఐ అభినందించారు.



గంజాయి స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న పోలీసులు

మల్లేశ్వరస్వామి కొండలో ఏనుగుల గుంపు

కల్లూరు, ఫిబ్రవరి 16: పులిచెర్ల-పాకాల మండలాల సరిహద్దు ప్రాంతమైన బేరిపల్లికి సమీపంలోని మల్లేశ్వరస్వామి కొండలో శుక్రవారం ఏనుగుల గుంపు మాటు వేసినట్లు స్థానికులు తెలిపారు. గురువారం వేకువజామున సుమారు 14 ఏనుగుల గుంపు కమలాపురం, చెన్నుపాటివారిపల్లి, ఆచారిఇండ్లకు చెందిన రైతుల పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు ఎస్టీకాలనీ సమీపంలోని మచ్చుకొండకు చేరుకున్నాయి. అటవీశాఖ అధికారులు ప్రజల సహకారంతో టపాకాయలు పేలుస్తూ మద్దినాయనిపల్లి అడవివైపు తరిమారు. అయితే 14 ఏనుగుల గుంపు శుక్రవారం ఉదయానికి మల్లేశ్వరస్వామి కొండ వద్దకు చేరుకున్నాయని స్థానికులు తెలిపారు. ఈ ఏనుగుల గుంపులో నెల రోజుల క్రితం జన్మించిన ఏనుగు పిల్ల ఒకటి ఉండడంతో ఏనుగులు గ్రూపులుగా విడిపోవని, వెంటనే దూర ప్రాంతానికి వెళ్లలేవని మంగళంపేట ఎఫ్‌బీవో నిఖిల్ తెలిపారు.

ఉద్యోగుల బకాయిలను మంజూరు చేయండి

● జేసీకి వినతిపత్రం ఇచ్చిన జేఏసీ నేతలు



చిత్తూరు, ఫిబ్రవరి 16: మూడు రోజుల నుంచి విడతల వారీగా ఆందోళనలు చేస్తున్న జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ శుక్రవారం ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై హామీలతో కూడిన వినతిపత్రాన్ని జేసీ శ్రీనివాసులుకు అందించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం 12వ పీఆర్‌సీ వేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని జేఏసీ నేత రాఘవులు వాపోయారు. 12వ పీఆర్‌సీ ఆలస్యమవుతున్నందున వెంటనే 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పీఎఫ్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని డిమాండు చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్‌సోర్సింగ్ వారికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. జేసీని కలిసిన వారిలో రఘు, బాలసుబ్రహ్మణ్యం, పన్నీర్ శెల్వం, మురళి తదితరులున్నారు.

20న కుప్పానికి నారా భువనేశ్వరి!

కుప్పం, ఫిబ్రవరి 16: ఎన్టీఆర్ ట్రస్టు ఎండీ నారా భువనేశ్వరి ఈనెల 20 లేదా 21వ తేదీలలో కుప్పంలో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఆమె నేరుగా గుడుపల్లె మండలం చేరుకుని 'నిజం గెలవాలి' కార్యక్రమంలో పాల్గొంటారని చెబుతున్నారు. భువనేశ్వరికోసం ఇప్పటికే ఒక వాహనం కుప్పం చేరుకుంది. దీన్ని పార్టీ కార్యాలయం ఎదుట ఉంచారు.

ప్రధానమంత్రి ఆదర్శ పథకం కింద 38 దళిత గ్రామాల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ పథకం కింద జిల్లాలో 38 దళిత గ్రామాలను కేంద్రప్రభుత్వం ఎంపిక చేసినట్లు జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గ్రామ జనాభాలో 50 శాతానికిపైగా దళితులుండే గ్రామాలను ఎంపిక చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతారన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. 2023-24లో తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పన, యువతకు ఉపాధి ఇచ్చి ఆర్థిక స్వావలంబన కల్పన కోసం రూ.21లక్షలు వంతున ఈ ఆదర్శ గ్రామాలకు విడుదలవుతాయన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో రెండు దశలుగా అమలుచేయనున్నట్లు వెల్లడించారు. గ్రామాలవారీగా ప్లాన్లను తయారుచేసి ఆమోదం పొందాక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, బీపీఆర్పీ కోఆర్డినేటర్ షణ్ముగరామ్, జడ్పీ ఏవోలు లోకేష్, రెడ్డిబాబు, పి.గౌరి, సురేంద్ర బాబు, నాగమణి, ఇతర అధికారులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

● అంతకుముందు ఆడిట్ అధికారులతో సమావేశమైన సీఈవో.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్‌కు అన్ని రికార్డులు, ఫైల్స్ సిద్ధం చేయాలని జడ్పీ అధికారులను సూచించారు. స్టేట్ ఆడిట్ ఏఏవో ఏజీ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి ఖజానా శాఖ ఉద్యోగులకు మినహాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి ఖజానా శాఖ ఉద్యోగులకు గతంలోలాగే మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని అదనపు రాష్ట్ర ఎన్నికల అధికారి కోటేశ్వరరావు కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల విధుల కోసం ఉపాధ్యాయులు సహా 71 ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకు సంబంధించి ఫొటో ఓటరు, గుర్తింపు కార్డు వివరాలు సేకరించే ప్రక్రియ వారం రోజుల పాటు కలెక్టరేట్‌లో జరిగింది. ఇందులో సమాచార, ఖజానా, పే అండ్ అకౌంట్స్, వాణిజ్య తదితర శాఖల ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఉంటుంది. ఇటీవల ఈ శాఖల ద్వారా కూడా ఉద్యోగుల వివరాల సేకరణ జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఖజానాశాఖ ఉద్యోగుల సంఘ నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసి ఎన్నికల విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీంతో ఖజానా ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించింది.

సెకండ్ స్పెల్ ప్రాక్టికల్స్ ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 16: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 11న ప్రాక్టికల్స్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి సెకండ్ స్పెల్ ప్రాక్టికల్స్ ప్రారంభమైనట్లు డీవీఈవో సయ్యద్ మౌలా తెలిపారు. జిల్లావ్యాప్తంగా 22 కేంద్రాల్లో జరిగే ఈ ప్రాక్టికల్స్‌లో 836 మంది విద్యార్థులకు గాను 806 మంది హాజరుకాగా, 30 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానందరాజు, బాలసుబ్రమణ్యం, మురళీకృష్ణ, స్క్వాడ్ మెంబరు హేమలత ఆధ్వర్యంలో ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. ఈ నెల 23న మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్ష జరుగుతుందని డీవీఈవో తెలిపారు.

ఎస్‌బీ డీఎస్పీగా సుధాకర్‌రెడ్డి



చిత్తూరు, ఫిబ్రవరి 16: జిల్లా స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా ఎన్.సుధాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన చిత్తూరులో ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పనిచేశారు. అనంతరం పలమనేరు డీఎస్పీగా బదిలీ అయిన ఆయన.. ఇటీవల ఎన్నికల నిబంధనల్లో భాగంగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ కాగా తిరిగి ఎస్‌బీ డీఎస్పీగా చిత్తూరుకు వచ్చారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులను కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన రెవెన్యూ, పోలీసు అధికారులతో ఎన్నికలకు సంబంధించి కమ్యూనికేషన్ ప్లాన్ తదితర అంశాలపై సమీక్షించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. 1266 లొకేషన్లలో 1762 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటికి నెట్‌వర్క్ వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, ఏఎస్పీ అరీఫుల్లా, కుప్పం, పలమనేరు ఆర్డీవోలు శ్రీనివాసులు, మనోజ్‌రెడ్డి, డ్వామా పీడీ రాజశేఖర్, చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం కింద 25 శాతం ఉచిత ప్రవేశాలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 16: వచ్చే విద్యాసంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల (బీసీ, మైనారిటీ, ఓసీ) పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు కలిగిన వారి పిల్లలు ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టానికి అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈనెల 23 నుంచి మార్చి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మొదటి విడత ఎంపిక జాబితా ఏప్రిల్ ఒకటిన, రెండో విడత జాబితా ఏప్రిల్ 15న విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రేపు కాణిపాకంలో కళా నైవేద్యం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 16: కాణిపాకంలో ఆదివారం కళా నైవేద్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి శుక్రవారం తెలిపారు. అగరంపల్లె ఆర్చి నుంచి ఆలయం వరకు సుమారు నాలుగు వేల మంది కళాకారులతో కోలాటాలు, చెక్క భజనలు, కులుకు భజన, పిల్లనగ్రోవులు, భజన బృందాలు, బుర్రకథ, కూచిపూడి, భరత నాట్యం, వీధి నాటకం కళాకారులు పాల్గొంటారన్నారు.

నిరసన ప్రదర్శనలతో 'భారత్ బంద్'



గాంధీ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శనలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా సంఘాల నేతలు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక వర్గం శుక్రవారం చేపట్టిన భారత్ బంద్.. నిరసన ప్రదర్శనలతో ముగిసింది. దుకాణాలు, కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. బస్సులు, ఆటోలు తిరిగాయి. రైతు, కార్మిక సంఘాల నేతలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిత్తూరులో నిరసన ప్రదర్శనగా గాంధీ విగ్రహం వద్దకు చేరిన నేతలు.. కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కడమే కాక రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. ఉపాధి హామీ పథకానికి రూ.2 లక్షల కోట్లు కేటాయిస్తూ 200 రోజులు పని కల్పించాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠం చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు నాగరాజు, సురేంద్రన్, చైతన్య, సురేష్, దొరస్వామి, జయశంకర్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



కనులపండువగా రథసప్తమి వేడుకలు

కిటకిటలాడిన తిరుమల మాడవీధులు

సప్త వాహన సౌందర్యం

తిరుమల, ఆంధ్రజ్యోతి

మలయప్ప స్వామి సప్త వాహన సేవల ఊరేగింపులతో తిరుమల గిరులు పులకించిపోయాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణలు, కర్పూర హారతులు, భజన బృందాల ప్రదర్శనలతో మాడవీధులు మార్మోగాయి.శుక్రవారం ఉదయం 5.30గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన వాహనసేవలను అశేష సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా 24గంటల పాటు గ్యాలరీల్లోనే ఉండి శ్రీనివాసుడి దర్శన భాగ్యంతో ఆనందపరవశులయ్యారు. సూర్యప్రభ వాహనసేవ సందర్భంగా శ్రీవేంకటేశ్వర బాలమందిరం విద్యార్థులు ఆలపించిన 'ఆదిత్యహృదయం', 'సూర్యాష్టకం' సంస్కృత శ్లోకాలు భక్తుల మనసుదోచాయి. వాహనసేవల్లో హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 900మంది కళాకారులు పాల్గొన్నారు. కోలాటం, లెజిమ్స్, దీపనృత్యం, కేరళ-ఓనం నృత్యం, జానపద నృత్యం, గోపికా నృత్యం, హారతి నృత్యం, అన్నమయ్య విన్నపాల నృత్యం, రాజస్థాన్-దాండియా నృత్యం, పుదుచ్చేరి-కరగాట్టం ,మోహినీ అట్టం, తెలంగాణ-గర్బ నృత్యం, బిందెల నృత్యం, కూచిపూడి నృనత్యం, మహారాష్ట్ర లావణి నృత్యం, అసోం-భయ నృత్యం, బెంగాలీ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు.



మాడవీధులను వీడని భక్తులు

రథసప్తమి వేడుకలను తిలకించడానికి గురువారం సాయంత్రం నుంచే భక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడం మొదలుపెట్టారు.సాధారణంగా సూర్యప్రభ వాహనం నుంచి చక్రస్నానం వరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. తర్వాత నెమ్మదిగా తగ్గుతుంది. అయితే ఈసారి మాత్రం భక్తులు ఎక్కడి వారు అక్కడే కూర్చుండిపోయారు. రాత్రి 9 గంటల వరకు గ్యాలరీల్లోనే ఉండి వాహనసేవలన్నీ వీక్షించారు. అయితే ఎక్కడి నుంచి గ్యాలరీల్లోకి ప్రవేశించాలనే సమాచారం తెలియక చాలామంది ఇబ్బంది పడ్డారు.భక్తులతో కొన్నిచోట్ల భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, రాంభగీచ వద్ద తీవ్రస్థాయిలో నెట్టడం విమర్శలకు దారితీసింది.





గరుడ, హనుమంత వాహనాలపై నారాయణుడు

ఏడు వాహనాలపై నారాయణుడు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా గంగాధరనెల్లూరు మండలం వేపంజేరిలోని లక్ష్మీనారాయణస్వామి శుక్రవారం ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. నారాయణుడి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అర్చకులు పూజాకార్యక్రమాలు నిర్వహించాక సూర్యప్రభ, శేష, అశ్వ, హంస, గరుడ, హనుమంత, చంద్రప్రభ వాహనాలపై నారాయణుడి ఉత్సవమూర్తిని అధిష్ఠింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు. కాగా, వేపంజేరిలో ఓవ్యక్తి మరణించడంతో పురవీధుల్లో వాహనసేవలను రద్దుచేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై స్వామివారిని అధిష్ఠింపజేయగా, కల్యాణ మండపంలోనే భక్తులు దర్శించుకున్నారు. తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబురెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్ పెద్దారెడ్డి (వరదరాజులురెడ్డి), ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, చెన్నైకి చెందిన యోగా మాస్టర్ భాస్కర్, భక్తులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై స్వామివారికి హారతి

దొంగ ఓటర్ల వలసను అరికట్టండి

● జేసీ శ్రీనివాసులుకు టీడీపీ నాయకుల వినతి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: 'ఇతర మండలాల నుంచి వలస దొంగ ఓటర్లను వైసీపీ నాయకులు ఓటర్ల జాబితాలో చేరుస్తున్నారు. వాటిపై కన్నేసి అలాంటి పేర్లను తొలగించండి' అని జేసీ శ్రీనివాసులును తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం మండలాల నుంచి ఫారం-6 ద్వారా 429, ఫారం-7 ద్వారా 334, ఫారం-8 ద్వారా 725 వెరసి 1488 దొంగ ఓటర్లను స్థానిక వైసీపీ నాయకులు దొడ్డిదోవన చేర్చేందుకు దరఖాస్తులు అందజేశారని ఆరోపించారు. ఈ మేరకు సాక్ష్యాలను చూపుతూ జేసీకి పలు పత్రాలను అందజేశారు. వీటిపై తగిన విచారణ జరిపి దొడ్డిదోవన వచ్చిన దరఖాస్తులను రద్దుచేసి స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారు చేయాలని కోరారు. టీడీపీ నాయకులు ఇచ్చిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జేసీ.. వీటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్, చిత్తూరు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాజశేఖర్, అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీపై

విచారణ జరిపి నివేదిక ఇవ్వండి

● బీసీవై పార్టీ అధినేత ఫిర్యాదుపై కలెక్టర్‌కు ఎన్నికల ప్రధానాధికారి ఆదేశం



డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

పుంగనూరు, జనవరి 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళి రాకముందే పుంగనూరులో పలమనేరు ఇన్‌చార్జిగా ఉన్న చిత్తూరు టౌన్ డీఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారించి నివేదిక పంపాలని కలెక్టర్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ఈనెల 6వ తేది పుంగనూరు కొత్త ఇండ్లు ఎల్ఐసీ కాలనీ, చదళ్ల సమీపంలోని తిమ్మికృష్ణాపురంలో బీసీవై పార్టీకి చెందిన గోడగడియారాలు పెద్దఎత్తున ఉన్నాయని, సోదాలు చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ తనిఖీలకు పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీగా రాజగోపాల్ రెడ్డి సెర్చ్‌వారెంట్ ఇచ్చారు. పోలీసు బలగాలు తనిఖీలు చేసి గోడ గడియారాలను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. 'మంత్రి ఆదేశాలతో పోలీసులు గోడ గడియారాల్లో నిషేధిత వస్తువులు పెడతారన్న అనుమానాలతో అందరి సమక్షంలో వీడియో రికార్డులతో పంచనామా చేయాలని చెప్పాం. గడియారాలకు సంబంధించి అన్ని రకాల బిల్లులు చూపిం చూపించినా పోలీసులు పట్టించుకోలేదు. మరుసటి రోజు గడియారాల బాక్సుల్లో కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు ఉన్నాయని నాపైన.. తిమ్మికృష్ణాపురంలో ఇంటి యజమాని శివకుమార్‌పై కేసులు నమోదు చేశారు. శివకుమార్‌ను అరెస్టు చేశారు' అంటూ పలు ఆధారాలను చూపుతూ ఎన్నికల సంఘానికి రామచంద్రయాదవ్ ఫిర్యాదు చేశారు. దీనిపై సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా స్పందించి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు.

రాష్ట్రపతి భవన్ నుంచి సీఎస్‌కు..

పుంగనూరులో కొందరు అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తూ రాజ్యాంగాన్ని అమలు చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని రాష్ట్రపతికి రామచంద్రయాదవ్ ఫిర్యాదు చేశారు. దీనిపైనా విచారించి నివేదిక పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రపతి భవన్ సెక్రటరీ పీపీ.మీనా ఆదేశించారు. కాగా, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తొత్తులుగా పనిచేస్తూ తప్పులు చేస్తున్న అధికారులకు శిక్ష తప్పదని ఒక ప్రకటనలో రామచంద్రయాదవ్ తెలిపారు.

కోలాహలంగా మైలేరు పండుగ



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16: మండలంలోని పిచ్చిగుండ్లపల్లెలో శుక్రవారం మైలేరు పండుగ కోలాహలంగా జరిగింది. బాగా పరిగెత్తిన కోడెగిత్తలకు నిర్వాహకులు భారీగా నగదు బహుమతులు ప్రకటించడంతో వివిధప్రాంతాల నుంచి పలువురు కోడెగిత్తలను తీసుకొచ్చి పరుగుపందెంలో వదిలారు. వేగంగా దూసుకెళుతున్న కోడెగిత్తలను నిలువరించడానికి యువకులు ఉత్సాహంతో పోటీపడ్డారు. మైలేరుపండుగను తిలకించడానికి అధికసంఖ్యలో జనం తరలివచ్చారు.

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

పలమనేరు, ఫిబ్రవరి16 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై శుక్రవారం పలమనేరులో వామపక్షనేతలు, రైతు సంఘ నాయకులు మోటర్‌సైకిల్ ర్యాలీతోపాటు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది దేశ రాజధానిలో రైతులు మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి ప్రభుత్వం మెడలు వంచారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఆ చట్టాలను రద్దు చేయకుండా కేంద్రం కాలయాపన చేస్తోందన్నారు. దీనిపై రైతులు మళ్లీ ఢిల్లీలో పోరాటాలు చేస్తుంటే వారిపై విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, నాయకులు వాడ గంగరాజు, ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా, భువనేశ్వరి, ఈశ్వరయ్య, రాజా, జయంతి, మద్దెల సుబ్రమణ్యం, మంజునాథ్, జ్యోతి, రైతు సంఘం జిల్లాకార్యదర్శి ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.

అమరావతి రైతుల ఉసురుపోసుకున్న జగన్

● తెలుగు రైతు నాయకుల విమర్శ

కుప్పం, ఫిబ్రవరి 16: సీఎం జగన్ అమరావతి రైతుల ఉసురు పోసుకున్నారని తెలుగు రైతు నేతలు విమర్శించారు. ఆ వాస్తవాలను వెల్లడిస్తున్న 'రాజధాని ఫైల్స్' సినిమా అంటే ఆయన వెన్నులో వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం తెలుగు రైతు నేతలు చలపతి, గోపాలప్ప మాట్లాడుతూ ఒక సినిమా చూసి ముఖ్యమంత్రి భయపడడం ఇదే తొలిసారి అన్నారు. రైతుల బతుకును చిత్రించిన చిత్రాన్ని అడ్డుకొనే నీచానికి ఒడిగట్టడం దారుణమన్నారు. ప్రజల్లో టీడీపీకి వస్తున్న మైలేజీ చూసి ఓర్వలేకనే సైకో చేష్టలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

వైభవంగా చక్రస్నానం




ఊరేగుతున్న సీతారాములు, చక్రస్నానం నిర్వహిస్తున్న భక్తులు

చౌడేపల్లె, ఫిబ్రవరి16: రథసప్తమి సందర్భంగా శుక్రవారం హరిమందిరంలో వెలసిన సీతారామలక్ష్మణ, అంజనేయ స్వాముల ఉత్సవమూర్తులను, సుదర్శన చక్రాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితులు సుదర్శన చక్రానికి హరిమందిరం వద్ద ఉన్న కోనేరులో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పలమనేరు మహిళా పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

పలమనేరు, ఫిబ్రవరి16 : పలమనేరు మహిళా పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ మొహమ్మద్ తెలిపారు. 1984లో అప్పటి ముఖ్యమంత్రి రామారావు పలమనేరుకు మహిళా పాలిటెక్నిక్‌ను మంజూరు చేశారు. 1985-86విద్యా సంవత్సరంలో ప్రారంభించబడింది. ఎన్‌బీఏ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా 2023 డిసెంబరు 22నుంచి 24 వరకు ఎన్‌బీఏ అక్రిడేషన్ బృందం వచ్చి బోధన, వసతులను పరిశీలించి తాజాగా ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చింది. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళా సంక్షేమానికి టీడీపీ కృషి

రామకుప్పం, ఫిబ్రవి 16: మహిళా సంక్షేమానికి టీడీపీ కృషి చేసిందని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు పద్మమ్మ, సీనియర్ నేత అలివేలు మంగమ్మ తెలిపారు. శుక్రవారం రాత్రి గొరివిమాకులపల్లెలో మహిళా గృహసారథుల సమావేశంలో వారు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

వి.కోట, ఫిబ్రవరి 16: తోటకనుమలో సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు డా.తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ బూటకపు మాటలు జనం నమ్మరు

శాంతిపురం, ఫిబ్రవరి 16: సీఎం జగన్ బూటకపు మాటలను జనం నమ్మే పరిస్థితి లేదని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యనిషేధం దశల వారీగా అమలు చేస్తామని చెప్పి ఊరూరా బెల్టుషాపులతో ప్రజల చేత అధిక ధరలతో నాసిరకపు మద్యాన్ని తాగిస్తూ, ప్రాణాలను తీస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఘనవిజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

18, 19 తేదీల్లో లక్కనపల్లెలో ఉరుసు

బైరెడ్డిపల్లె : లక్కనపల్లెలో వున్న హజరత్ ఖ్వాజా గరీబున్ నవాజ్ దర్గా ఉరుసు ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 18వతేదీ రాత్రి గంధం ఊరేగింపు, 19వ తేది రాత్రి సిమ్రాన్‌తాజ్, షాబాజ్ గాయనీ గాయకులచే పాటకచ్చేరి జరుగుతుందన్నారు.

వైభవంగా రథసప్తమి





భూనీలా వెంకటేశ్వరస్వామిని గజవాహనంపై ఊరేగింపు, దేవళంపేటలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి, పుంగనూరులో ఊరేగుతున్న శ్రీవారు

పలమనేరు, ఫిబ్రవరి16 : పలమనేరులో శుక్రవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని భూనీలా వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామిని గజవాహనంపై అలంకరణలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పుంగనూరులో ...

పుంగనూరు రూరల్ : స్థానిక కోనేటి వద్ద వెలసినకళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామిని సూర్యప్రభ వాహనంపై అలంకరించి పురవీదుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు శ్రీనివాసాచార్యులు భక్తులు పాల్గొన్నారు.


దేవళంపేటలో ...

కల్లూరు : పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. స్వామికి సుప్రభాతసేవ, విశ్వక్సేతపూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, అలంకరణ, మంత్రహోమం, సుదర్శనహోమం, అర్చన, మహానైవేద్యం, మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఆశీనులుకాగా పురవీధుల్లో ఊరేగించారు. వాహనంముందు కోలాటాలు, భజనలు చేశారు. అలయ కోనేరులో స్వామివారి చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు దర్శించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదారులుగా చిన్ననగరికి చెందిన గురుస్వామి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

సోమల : ఆవులపల్లె ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, కమ్మపల్లె లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, చింతలవారిపల్లె, మిట్టపల్లె, సూరయ్యగారి పల్లె ఆలయాల్లో పూజలు, అభిషేకాలు జరిపారు.

వైభవంగా ధ్యానాభిరామస్వామి రథోత్సవం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి16 : మండలంలోని కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధరకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథంలో సీతాలక్ష్మణసమేత ధ్యానాభిరామస్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ గావించి కొలువుదీర్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా రథాంగహోమం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, శ్రీరామనామస్మరణల మధ్య భక్తులు రథాన్ని లాగారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మంగళహారతులిచ్చారు. నిర్వాహకులు ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

విశేషాలంకరణలో ధ్యానాభిరామస్వామి, కార్వేటికొండపై రథోత్సవం

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి




పుంగనూరులో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘ నాయకులు, పలమనేరులో ర్యాలీ నిర్వహిస్తున్న బలిజ సంఘ నాయకులు

పలమనేరు, ఫిబ్రవరి16: శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం బలిజ అభ్యుదయ సేవాసంఘం నాయకులు, సభ్యులు పలమనేరు పట్టణంలో మోటరుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర, పీజేసీ బాబు, అక్కంగారి మూర్తి, కిరణ్‌కుమార్, చైతన్య, ఆకులగజేంద్ర, శ్యామ్, నరేష్, హేమంత్, జయశంకర్, సుబ్బనాగయ్య, చెంచురెడ్డి, రూపేష్, దైవప్రసాద్, శ్రీధర్, హరీష్, సుదర్శనబాలాజి తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు : శ్రీకృష్ణదేవరాయుల జయంతి వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భీమగానిపల్లె బస్టాండ్ క్రాస్‌లో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమాజానికి శ్రీకృష్ణదేవరాయులు అందించిన సేవలను కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బలిజ సంఘనాయకులు పూలత్యాగరాజు, నానబాల గణేశ్, డాక్టర్ ప్రభాకర్, , నానబాల మణి, కుమార్, నరేశ్, నందీశ్వర్, నానబాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపేందుకే జనసేనతో పొత్తు : అమర్

పలమనేరు, ఫిబ్రవరి16 : రాష్ట్రంలో వైసీపీ మూర్ఖపు పాలనను సాగనంపేందుకే జనసేనతో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకొని ఈ ఎన్నికల్లో ముందుకు సాగుతోందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు దోరణాల చెంగన్నవీధి, తాలూకా కచ్చేరివీధి, మునినారాయణవీధి, సూరప్పవీధి, చిన్నగాండ్లవీధి, రజకవీధి, అంబేడ్కర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, ఎస్టీకాలనీ, జండామఠం, పోలీసు లైన్ వీధుల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం మిని మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్వీ బాలాజి, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యం గౌడు, నాగరాజు, ఖాజాపీర్, చాంద్‌బాషా, శ్రీధర్, మదన్మోహన్, సుబ్బు, మూర్తి, సుదర్శనబాలాజి, సీతాపతి, చెన్నరాయప్ప, మురళి, శివకుమారి, ప్రమీళ, పర్వీన్, జనసేన నాయకులు దిలీప్, చైతన్య, హరీష్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

రెవెన్యూ సహాయకుల కార్యవర్గం



లక్ష్మణ, ఇర్ఫాన్‌అలీ

రొంపిచెర్ల,ఫిబ్రవరి16: జిల్లా రెవెన్యూ సహాయకుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రాష్ట్ర ఆ సంఘం అధ్యక్షుడు అంజి సమక్షంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా రొంపిచెర్లకు చెందిన వై.లక్ష్మణ, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఇర్ఫాన్‌అలీ, జిల్లా కార్యదర్శిగా అజ్జల్ (పులిచెర్ల), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినాయకుడు (పెనుమూరు) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ అలీ మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో జరిగే దీక్షా కార్యక్రమంలో ఈ నూతన కార్యవర్గం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నృత్యప్రదర్శనలో సదుం బాలిక ప్రతిభ



సదుం, ఫిబ్రవరి 16: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళాక్షేత్రంలో గత బుధవారం నిర్వహించిన దక్షిణ భారత స్థాయి నృత్యప్రదర్శనలో సదుం మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన టైలర్ ఎర్రయ్య మనవరాలు చార్వి భరత నాట్యంలో తన ప్రతిభను చాటి ద్వితీయ విజేతగా నిలిచి 'అయోధ్య బాలరాముడి పురస్కారం' అందుకుంది. పురస్కారం అందుకున్న చార్విని మండల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల అభినందించారు.

ఇన్‌స్పైర్‌లో విజయవాణి విద్యార్థి ప్రతిభ



కుప్పం, ఫిబ్రవరి 16: కుప్పంలోని విజయవాణి విద్యా సంస్థలో 10వ తరగతి చదువుతున్న దీక్షిత జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ డాక్టర్ భాగ్యరాజ్ ప్రభంజన్, డైరెక్టర్ డాక్టర్ సుభాషరాజ్‌లు తెలిపారు. ఉపాధ్యాయుడు విశ్వ పర్యవేక్షణలో ఆమె ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని వారు అభినందించారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్య శిబిరం

కుప్పం రూరల్, ఫిబ్రవరి 16: కుప్పం మండలం గుడ్లనాయనపల్లెలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి పరీక్షలు ఇందులో ఉన్నాయి. డాక్టర్ మధు, వైద్య సిబ్బంది ఝాన్సీరాణి, పార్థసారథి, మణికంఠ, గణేశ్‌లు పాల్గొన్నారు.

రేపు వాలీబాల్ పోటీలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి16: ఈ నెల 18న బసవరాజ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడలు నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయబహుమతి రూ.10వేలు, నాలుగో బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆదివారం ఉదయం 9గంటలకే క్రీడామైదానంలోకి చేరుకోవాలన్నారు. వివరాలకు 94409 31824, 9182960760 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి16: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు మురళి, శ్రీనివాసులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అధికసంఖ్యలో ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

బాటగంగమ్మకు విశేష పూజలు



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16 : పట్టణంలో వున్న బాటగంగమ్మ ఆలయంలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు నాగేంద్ర, జయచంద్ర అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు జరిపారు. స్థానిక కోదండరామాలయం, శేషాద్రిస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయం, కడపనత్తం నలగుండ్రాయస్వామి ఆలయం, పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయంలో కూడా రథసప్తమి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నేడు లక్కనపల్లెలో కబడ్డీ పోటీలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16 : లక్కనపల్లెలో శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.21వేలు, ద్వితీయ బహుమతిగా రూ.14వేలు, తృతీయ బహుమతిగా రూ.7వేలు నగదు అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు రూ. 500 ప్రవేశ రుసుము చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

రేపు క్షత్రియ సంఘ సమావేశం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి16: ఈనెల 18న క్షత్రియ సంఘసభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు భక్తవత్సలరాజు తెలిపారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన క్షత్రియ కులస్తులందరూ తప్పక సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘ నాయకులు భాస్కర్‌రాజు, లక్ష్మణ్‌రాజు, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు కావేటిగారిపల్లి విద్యార్థి ఎంపిక



కల్లూరు, ఫిబ్రవరి 16: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కె.జశ్వంత్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మంజువాణి తెలిపారు. యాదమరి మండలం మోర్దానపల్లి ఉన్నత పాఠశాలలో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగిన ప్రదర్శనలో కె.జశ్వంత్ రూపొందించిన కాయిన్ బేస్డ్ రేషన్ డిస్పెన్సర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైందన్నారు. రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన కె.జశ్వంత్‌కు ప్రశంసాపత్రం, మెమెంటోను జిల్లా విద్యాశాఖ అధికారులు అందజేశారన్నారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి ఉట్లోత్సవం



చౌడేపల్లె, ఫిబ్రవరి16: మండలంలోని చారాలలో వెలసిన అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉట్లోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ సమీపంలో యువకులు ఉత్సాహంగా ఉట్లు కొట్టి స్వామివారి ప్రసాదం అందుకున్నారు.

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి

శాంతిపురం, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజులఖాదర్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన శాంతిపురం మండలం ఎంకేపురంలో ముస్లిం కుటుంబాలను కలిసి చంద్రబాబు తరపున ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల సంక్షేమం సంక్షోభంలో పడిందన్నారు. కార్యక్రమంలో నేతలు సర్దార్‌బాషా, అన్వర్‌బాషా, ముజీబ్, హైదర్, అబ్బాస్, షేక్‌బాషా, సల్మాన్, షబ్బీర్, కలీం, లతీఫ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఫిబ్రవరి16: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. వేదపండితులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. రాహుకాలంలో అమ్మవారికి పంచామృతా భిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల అభిషేక పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మొరవపల్లెలో తాగునీటి కోసం నిరసన

రొంపిచెర్ల, ఫిబ్రవరి16: జాండ్లవారిపల్లె పంచాయతీలోని మొరవపల్లెలో తాగునీటి పథకానికి తాళం వేశారని, సమస్య పరిష్కరించాలని కార్యదర్శికి ఫిర్యాదు చేస్తూ ఖాళీ బిందెలతో గ్రామస్తులు నిరసన తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణంలో ఉన్నందున తాగునీటి బోరు వద్దే గ్రామస్తులు నీరు పట్టుకుని వెళ్లేవారు. కొంత నీరు పక్కపొలంలోకి పోతుండడాన్ని గుర్తించిన కొంతమంది నీరు వృథాగా పోతోందని, మరికొందరు పొలానికి వాడుకుంటున్నారని సర్పంచ్ నాగిరెడ్డికి తెలిపారు. దీంతో మోటరు పెట్టెకు తాళం వేశారు. దీంతో శుక్రవారం కార్యదర్శి పైతాజ్‌బీకి గ్రామస్తులు సమస్యను తెలపగా సర్పంచ్, కార్యదర్శి వచ్చి తాళం తీయించారు.

మతతత్వ పార్టీలకు గుణపాఠం చెప్పాలి

పుంగనూరు, ఫిబ్రవరి16: రానున్న రాజుల్లో మతతత్వ పార్టీలకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్ అత్తావుల్లాఖాన్ తెలిపారు. శుక్రవారం పుంగనూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న మత రాజకీయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సమావేశంలో ఎస్‌డీపీఐ నాయకులు చాంద్‌బాషా, జమీర్‌లాల్, యూసఫ్, అతిక్‌బాషా, యునుస్, సిద్ధిక్, ముబారక్, హుజైప్, సద్దాంచ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

11మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి16: నేతిగుంట్లపల్లె పంచాయతీలోని హంద్రీనీవా కాల్వ వద్ద శుక్రవారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించి 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మహేంద్రబాబు తెలిపారు. వారి వద్ద రూ.49.600 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గన్నావారిపల్లెలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠకు శ్రీకారం

సోమల, ఫిబ్రవరి16: సోమల పంచాయతీ గన్నావారిపల్లెలో పునర్నిర్మాణం చేసిన రామాలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వాముల విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం నుంచి ప్రారంభించనున్నారు. 17న గణపతి పూజ, కంకణధారణ, కలశప్రతిష్ఠ, వాస్తుహోమం, 18న గణపతిహోమం, గ్రామోత్సవం, పుష్పశయ్యాదివాసం, జీర్ణ విగ్రహస్థాపన, 19న వ్యాసహోమం, శిఖర కలశస్థాపన, మూర్తి హోమం, కుంభాభిషేకం, గోదర్శన, కన్యాదర్శన, సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడానికి గ్రామస్తులు ఏర్పాట్లు చేపట్టారు.

వైసీపీ పాలనలో విధ్వంసం: దొరబాబు



సంతపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 16: వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. శుక్రవారం నగరంలోని 45, 46వ డివిజన్లు పత్రాంపల్లె, సంతపేటలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి రాగానే ప్రజావేదిక కూల్చివేతతో మొదలు పెట్టిన అరాచక పాలన నేటికీ కొనసాగుతోందని చెప్పారు. జగన్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, టీడీపీ అధినేత చంద్రబాబును సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు గురజాల జగన్‌మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, రాజశేఖర్, శంకర్, సీఎం విద్య, చిట్టిబాబు, పర్వీన్‌తాజ్, సురేష్, శీన, శ్రీధర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలి: జేఏసీ

నగరి, ఫిబ్రవరి 16: నగరి పట్టణ పరిధిలోని పీసీఎన్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉపాధ్యాయ, ఉద్యోగ జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నగరి పట్టణంలో ఫిబ్రవరి 17న ధర్నా నిర్వహించనున్నట్లు జేఏసీ నేత ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు రావాల్సిన అన్ని ఆర్థిక ప్రకారం వెంటనే చెల్లించాలని పీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌నాయకులు మునిరత్నం, ఎస్టీయూ నాయకులు లక్ష్మీనారాయణ, ఏపీటీఎఫ్ నాయకులు నరేంద్ర, స్కూలు అసిస్టెంట్ సంఘం సురేష్‌బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

బావిలో పడి జార్ఖండ్ వ్యక్తి మృతి

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 16: జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని నాగమవాండ్లపల్లె వద్ద జరిగింది. ఐరాల ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు జార్ఖండ్‌కు చెందిన సంతోష్‌గోస్వామి(30) గోవిందరెడ్డిపల్లె వద్ద ఓ మ్యాంగో ఫ్యాక్టరీ నిర్మాణ పనుల కోసం విచ్చేశాడు. గత ఐదు రోజులుగా సంతోష్‌గోస్వామి కనిపించడం లేదు. శుక్రవారం నాగమవాండ్లపల్లెలోని వ్యవసాయ బావిలో దుర్వాసన వస్తుండటంతో ఎవరిదో మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అతడు సంతోష్‌గోస్వామిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన ఆనందయ్య

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 16: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన ఆనందయ్య గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండేవాడు. రోగం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఆయన మృతదేహానికి బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తోపుడు బండి వితరణ

గుడిపాల, ఫిబ్రవరి 16: మండలంలోని నిరుపేదలను ఆదుకోవడమే జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ లక్ష్యమని మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఉదయ అన్నారు. శుక్రవారం మండలంలోని వసంతాపురంసంతలో బసవాపల్లికి చెందిన చందన శ్యామ్‌కు తోపుడుబండిని పంపిణీ చేశారు.

సచివాలయం ప్రారంభం

నగరి, ఫిబ్రవరి 16: నగరి మండల పరిధిలోని బుగ్గ అగ్రహారం సచివాలయాన్ని మంత్రి రోజా శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ బాలన్, సర్పంచ్ రవికుమార్, పార్టీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, సచివాలయ కన్వీనర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నగరి, ఫిబ్రవరి 16: డెంగ్యూ జ్వరంతో ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందిన మునస్వామి భార్య మంజుల కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.4 లక్షల చెక్కును మంత్రి రోజా శుక్రవారం నగరి క్యాంపు కార్యాలయంలో అందించారు. మంజుల భర్త మునస్వామికి మంత్రి ఈ చెక్కును అందించారు.

జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ రెడ్డప్ప

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 16: మండలంలోని దండువారిపల్లెలో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం చైర్మన్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డప్పతో కలిసి ప్రకృతి వ్యవసాయ రైతు జగదీష్ రెడ్డి పండిస్తున్న కూరగాయల తోటలు, మామిడి పంటలను పరిశీలించారు. ఎంపీపీ అమరావతి, సర్పంచ్ అమర, అధికారులు మురళీకృష్ణ, ఏవో చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐరాల ఎంపీడీవోగా కుసుమకుమారి

ఐరాల, ఫిబ్రవరి 16: ఐరాల ఎంపీడీవోగా కుసుమకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వెదురుకుప్పం ఎంపీడీవోగా పురుషోత్తం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 16: వెదురుకుప్పం ఎంపీడీవోగా పురుషోత్తం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న పురుషోత్తంకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రేమ్‌రాజ్‌కుమార్ బదిలీపై వెళ్లారు.

నారాయణస్వామి మామా.. రిటైర్మెంట్ తీసుకో...

- డాక్టర్ థామస్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ థామస్, టీడీపీ నేతలు

పాలసముద్రం, ఫిబ్రవరి 16: 'డిప్యూటీ సీఎం నారాయణస్వామి మామా... ప్రజలు నిన్ను తిరస్కరిస్తున్నారు... రిటైర్మెంట్ తీసుకో' అంటూ గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్ణజిమ్మాపురంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో జయహో బీసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రజల గురించి పట్టించుకోవడం మానుకొని సీఎం జగన్ భజన చేస్తున్నారని, నారాయణస్వామి అంటేనే కుట్ర, కుతంత్రాలు, కాళ్లమీద పడి మొక్కడం అలవాటుగా చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులే ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోవు ఎన్నికల్లో బీసీలు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. చిట్టిబాబు నాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు ఆసరా పథకం కింద కులవృత్తులవారికి సబ్సిడీ ధరలపై పనిముట్లు ఇచ్చి ఆదుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నియోజకవర్గ పరిశీలకులు రవిప్రకాష్, నాయకులు వాసు నాయుడు, దాము రెడ్డి, కిషన్ చంద్, సీఆర్ రాజన్, షణ్ముగ రెడ్డి, రవి యాదవ్, వెంకటేష్ యాదవ్, శ్రీధర్ యాదవ్, జ్యోతియాదవ్, హేమాద్రి, దాము యాదవ్, నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలిజకండ్రిగ నుంచి క్రిష్ణజిమ్మాపురం వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



సూర్యనమస్కారం చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా శుక్రవారం నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కట్టమంచి వరదరాజుల స్వామి ఆలయంలో నిర్వహించిన గరుడసేవలో ఆర్టీసీ వైస్ చైర్మన్‌విజయానందరెడ్డి పాల్గొన్నారు. కార్పొరేటర్ హరిణిరెడ్డి ఆధ్వర్యంలో గోపూజలునిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారిని ఏడు వాహనాల్లో అధిష్ఠింప చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వాస్పత్రి సమీపంలోని మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వర ఆలయంలో కూడా సూర్యప్రభ వాహనసేవ నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో డీపీపీఆధ్వర్యంలో విద్యార్థులతో సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రావతి, మునస్వామి, గోవిందన్, రామ్మూర్తి పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

నగరి, ఫిబ్రవరి 16: రథ సప్తమిని పురస్కరించుకుని నగరి పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండవగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. టీటీడీ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామివార్లకు పట్టు పీతాంబరాలు అందజేశారు. మంత్రిరోజా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, ఆలయ అధికారి వెంకటరమణ, మణిగండన్, అర్చకులు ధన్వంతరి, నరసింహప్రసాద్, టీటీడీ వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా నేత్ర ప్రదాయని క్షేత్రంలో వారం రోజుల పాటు నిర్వహించిన కుంభాభిషేక వేడుకల్లో సేవలు అందించిన పురోహితులు, ఆలయ సిబ్బందికి వస్త్రాలు, అమ్మవారి ప్రసాదాలను మంత్రి రోజా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్రయ్య పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామిని శుక్రవారం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారికి కర్పూర నీరజనాలు అర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావితరాలకు మేధావులు కావాలి



ఉత్తమ విద్యార్థులకు కప్ అందజేస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి, శైలజాకుమారి తదితరులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 16: విద్యార్థులు భావితరాలకు మేధావులై దేశాభివృద్ధికి దిక్సూచిలు కావాలని ఏపీ అడ్వకేట్స్ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్. ద్వారకనాథరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక బృందావన్ పాఠశాల 11వ వార్షికోత్సవం పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో వారిని రాణించేలా చేయడంలోనే పాఠశాల స్థాయి, విలువలు పెరుగుతాయన్నారు. కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ పాఠశాల వార్షిక నివేదికను చదివి వినించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి

చిత్తూరు, ఫిబ్రవరి 16: నా సంతకం, నా ఓటు, నా హక్కు, నా భవిష్యత్తు అనే నినాదంతో నగర యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఆర్వో కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. నగరపాలక కార్యాలయంలో సంతకాలతో ఓటు హక్కు అనే కార్యక్రమాన్ని శుక్రవారం మేయర్ అముద ప్రారంభించారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

చిత్తూరు, ఫిబ్రవరి 16: చిత్తూరు నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నగరపాలక కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి మేయర్ అముద అధ్యక్షత వహించగా కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, సభ్యులు శ్రీకాంత్, సహదేవన్, శోభ, పూర్ణచంద్రరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో సాధారణ నిధులు, రోడ్డు సేఫ్టీఫండ్, ట్రాఫిక్ సిగ్నల్స్ తదితర ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరంలో అవసరమైన చోట్ల ప్రజలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంపై చర్చించారు. అదేవిధంగా అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేయడానికి ఇరువారం రెవెన్యూ పరిధిలో తహసీల్దార్ గుర్తించిన 8.45 ఎకరాల భూమికి కమిటీ ఆమోదం తెలిపింది. ఏసీ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బలిజసంఘం నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 16: శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో వున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బలిజ సంఘం నేత ఓఎం రామదాసు, మాజీ మేయర్ కఠారి హేమలత, డీకే బద్రీనారాయణ, మురుగేష్, కాజూరు బాలాజీ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు తెలుగు సంస్కృతీ సంప్రదాయాల విస్తరణకు విశేష కృషి చేశారని కొనియాడారు.

తవణంపల్లె: మండలంలోని అరగొండ పైమాఘంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అరగొండ పాత బస్టాండు వద్ద గల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్‌శెట్టి, పైమాఘం గ్రామస్తులు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' చిత్రాన్ని అడ్డుకోవడం

పిరికిపంద చర్య: టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శన నిలిపివేయడం సీఎం జగన్ తీసుకున్న పిరికిపంద చర్య అని టీడీపీ నేతలు విమర్శించారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల వ్యవసాయ భూములను ఇచ్చిన బడుగు, బలహీన వర్గాల రైతుల త్యాగాలను చిత్రంలో చూపించడం తప్పా అని ప్రశ్నించారు. రాజధానికోసం రైతులు చేస్తున్న నిరసనదీక్షలను, వారు పడిన కష్టాలను యథార్థంగా ప్రజల ముందుకు తీసుకురావడానికి చేసిన ప్రయత్నమే రాజధాని ఫైల్స్ చిత్రమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పూతలపట్టు ఇన్చార్జ్ మురళి మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు వెంకటేష్ యాదవ్, మోహన్‌రాజ్, సుబ్రి తదితరులు పాల్గొన్నారు.



జీజేఎం ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు



పూజా కార్యక్రమానికి హాజరైన పులివర్తి నాని తదితరులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 16: నగరంలోని బీవీరెడ్డి కాలనీలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ నేత గురజాల జగన్మోహన్ స్వగృహంలో రథసప్తమిని పురస్కరించుకుని శుక్రవారం బాలకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి ఆదిత్య హృదయ పారాయణం, రాజ్యలక్ష్మి, రాజశ్యామల యాగం, సరస్వతి పూజతోపాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, నేతలు చెన్నకేశవులు నాయుడు, సురేంద్రకుమార్, సీఆర్ రాజన్, బాలాజి నాయుడు, కోదండయాదవ్, కాజూరు బాలాజి, హేమాద్రి నాయుడు, ఆర్ఎస్ నాయుడు, సుబ్బానాయుడు, శశికర్ బాబు, జయచంద్ర నాయుడు, పాకాల కిషోర్ నాయుడు, అన్వేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'స్వామినాథన్' సిఫార్సులను అమలు చేయాలి

నగరి, ఫిబ్రవరి 16: స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఏఐటీయూసీ నాయకత్వంలో నిరసన తెలిపారు. కోదండయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల్లో నల్లచట్టాల పేరుతో రైతులను అణగదొక్కిందని, అందుకు నిరసనగా 16వ తేదీన దేశవ్యాప్త బంద్‌కు కార్మిక, రైతు సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, మురళి, బాషా, శేఖర్, రాము పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమం కోసమే టీడీపీతో పయనం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 16: రాష్ట్ర సంక్షేమం కోసమే టీడీపీతో కలసి జనసేన పార్టీ పయనిస్తోందని ఆపార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు స్రవంతిరెడ్డి తెలిపారు. శుక్రవారం దామరకుప్పంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ఇచ్చారు. నేతలు యతీశ్వర్‌రెడ్డి, కావలి సతీశ్, రాఘవ, సెల్వి, రుద్ర, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండలంలోని ఎర్రమరాజు పల్లిలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించి, మేనిఫెస్టోలోని పథకాలను వివరించే కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

విజయపురం, ఫిబ్రవరి 16: మండలంలోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిక్‌టుప్యాక్ పరిశ్రమ సీఈవో వీఎం రాజా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాతార్కాడులో ఆయన మాట్లాడుతూ డిప్లమో, ఇంజనీరింగ్ అర్హతతో 3 షిఫ్ట్ ఇన్‌చార్జి పోస్టులు, డిగ్రీ అర్హతతో 6 సూపర్‌వైజర్ పోస్టులు, డిప్లమో, ఐటీఐ అర్హతతో మెకానిక్ ఆపరేటర్ పోస్టులు 12, పదవ తరగతి అర్హతతో హెల్పర్లు 28 మంది కావాలని చెప్పారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత 19న సోమవారం ఉదయం 10 గంటలకు పాతార్కాడులోని పిక్‌టుప్యాక్ వద్ద ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

టీడీపీ నాయకుడి మృతికి పలువురి నివాళి

విజయపురం, ఫిబ్రవరి 16: మండలంలోని శ్రీహరిపురంలో టీడీపీ నాయకుడు శ్రీనివాసులు యాదవ్ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ శుక్రవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు సురేశ్‌రాజు, చిన్నబ్బరాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎం వర్గం బైక్ ర్యాలీ

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 16: డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుకూల వర్గ వైసీపీ నాయకులు సిద్ధం పేరుతో శుక్రవారం మండలంలోని చొక్కమడుగు నుంచి వయా 49. కొత్తపల్లిమిట్ట వరకు మాజీ జడ్పీటీసీ గురువారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు మణి, భూపతిరెడ్డి, జనార్ధన్, కుప్పయ్య, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజా సమస్యల పరిష్కారం



థామస్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు తదితరులు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 16: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ పేర్కొన్నారు. శుక్రవారం ముద్దికుప్పం గ్రామ పరిధిలోనే చొక్కమడుగు, దిగువ ముద్దికుప్పం, ఎగువ ముద్దికుప్పం గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికీ మన థామస్ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు రవి ప్రకాష్ పాల్గొన్నారు. టీడీపీ ఆరు హామీల కరపత్రాలు పంపిణీ చేశారు. చొక్కమడుగు నుంచి గణేష్‌రెడ్డి అతడి సోదరులు, దిగువ ముద్దికుప్పం నుంచి పలువురు మహిళలు, యువకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. నాయకులు రాజేంద్ర నాయుడు, ఎన్. కుమార్, జల్లా వెంకటేష్ రెడ్డి, రాజశేఖర్ నాయుడు, హేమాద్రి, చల్లయ్య, మారయ్య, పుల్లూరు బాబు, మహబూబ్ బాషా, బాలాజీ నాయుడు, గణపతి, భాస్కర్ నాయుడు, సిద్దయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేపట్టాయి. ఈ క్రమంలో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. బాబు ష్యూరిటీ కరపత్రాలను పంపిణీ చేశారు. వెదురుకుప్పం టీడీపీ మండలాధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు చెంగల్రాయరెడ్డి, నాయకులు షణ్ముగం, కుపేంద్ర, డేటా అనాలసిస్ట్ మురళీ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌లో

ద్వితీయ బహుమతి సాధించిన డిసోమియా



కార్వేటినగరం, ఫిబ్రవరి 16: జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో కార్వేటినగరం శ్రీలక్ష్మీ నరసింహ విద్యా సంస్థకు చెందిన డిసోమియా అనే విద్యార్థిని ద్వితీయ బహుమతి సాధించింది. యాదమరి మండలంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ద్వితీయ విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో డిసోమియాని విద్యాసంస్థ నిర్వాహకులు దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.